క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత

సైదాపూర్: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను బుధవారం వాహన తనిఖీల్లో భాగంగా పట్టుకున్నట్లు సైదాపూర్ ఎస్సై ఆరోగ్యం తెలిపారు. మండలకేంద్రంలో సేకరించిన 10 క్వింటాళ్ల రేషన్‌బియ్యం ఏపీ36 వై 1792 టాటాఏస్ వాహనంలో బొమ్మనపల్లికి చెంది బత్తుల బిక్షపతి, బత్తుల చింటు తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

సైదాపూర్: మండలంలోని రాయికల్‌లో బుధవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ చేస్తుండగా గ్రామస్తులు అందించిన సమాచారంతో పేకాటఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఆరోగ్యం తెలిపారు. వారిని అరెస్టు చేసి రూ. 3,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

విద్యార్థులకు కళ్లకలక...

శంకరపట్నం: మండలంలోని ప్రభుత్వపాఠశాల విద్యార్థులు కళ్లకలకతో బాధపడుతున్నారు. వారం క్రితం కురిసిన భారీవర్షాలతో కొంతమంది విద్యార్థులు కళ్లకలక బారినపడ్డారు. స్థానికంగా వైద్యం చేయించుకున్న విద్యార్థులు ఇంటివద్ద విశ్రాంతి తీసుకున్నారు. కళ్లకలకతో బాధపడుతున్న పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు బుధవారం కళ్లజోడు ధరించి పాఠశాలకు హాజరైనట్లు తెలిసింది.

వ్యక్తిపై కేసు

జమ్మికుంట: స్థలం విషయంలో గొడ్డలితో దాడికి పాల్పడేందుకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదుచేసి, రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ బార్పటి రమేశ్ బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పోలీస్‌క్వార్టర్స్ సమీపంలో 467 సర్వేనంబర్‌లోని 5 గుంటల స్థలం వివాదంలో మిడిదొడ్డి సదానందం, అదేకాలనీకి చెందిన బొడికెల సమ్మయ్య అనే వ్యక్తికి మధ్య చాలాకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో గతనెల 30న మిడిదొడ్డి సదానందం, కుటుంబ సభ్యులు స్థలాన్ని శుభ్రంచేస్తున్నక్రమంలో సమ్మయ్య గొడ్డలితో దాడికి పాల్పడేందుకు యత్నించి, గుడిసె, జేసీబీ ధ్వంసం చేశాడు. దీంతో బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమేశ్ తెలిపారు.

వైద్యశిబిరానికి స్పందన

సైదాపూర్: మండలంలోని ఆకునూర్‌లో బుధవారం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాఖ అధికారులు నిర్వహించిన వైద్యశిబిరానికి స్పందన లభించింది. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్యురాలు సంధ్యారాణి సూచనలు చేశారు. సుమారు 98 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణారెడ్డి, ఫార్మసిస్టు విజేందర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

హుజూరాబాద్‌రూరల్: అర్హులైన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలనిఏడీఏ సునీత బుధవారం తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు గల రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద తమ ఆధార్ కార్డు, నామినీ ఆధార్‌కార్డ్, పట్టా పాస్‌బుక్ జిరాక్స్, రైతుబీమా దరఖాస్తు ఫారంతో సంప్రదించి ఆన్‌లైన్‌లో నమోదుచేసుకోవాలన్నారు. గతంలో రైతు బీమా పథకంలో అర్హులైన వారు తమ నామినీ వివరాలు మార్చుకోవాలనుకుంటే తమ వివరాలను సంబంధిత అధికారి వద్ద నమోదు చేసుకోవాలన్నారు.

కస్తూరిబా పాఠశాల తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలను బుధవారం డీఈవో జనార్ధన్‌రావు తనిఖీచేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతం రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం వివరాలు తెలుసుకున్నారు. కేజీబీవీలో ప్రతీ తరగతికి వెళ్లి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మాధవి, క్లస్టర్ హెడ్‌మాస్టర్ మమతాగౌతమి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: మండలంలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన ఎ.మహేశ్ అనేవ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే వైద్యఖర్చులకు ముందస్తుగా రూ.2.5లక్షల ఎల్‌వోసీని అందించారు.


గండిపడిన చెరువు కట్ట (ఫైల్)


వృథాగా పోతున్న వరద నీరు

భారీగా వరద.. మిగిలింది బురద

- నీరులేక వెలవెల బోతున్న ఎల్లమ్మ చెరువు
- పరిహారం చెల్లించి పనులు చేయించాలంటున్న రైతులు

గంగాధర: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు నీటితో నిండి మత్తళ్లు దుంకుతుంటే మండలకేంద్రంలోని ఎల్లమ్మ చెరువు మాత్రం నీరులేక వెలవెలబోతోంది. ఎల్లమ్మ చెరువుకు గతేడాది వర్షాకాలంలో కట్టకు గండి పడడంతో ఎగువ నుంచి, పక్కనున్న నారాయణాపూర్ చెరువు నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరినా నీరు నిల్వలేక చివరికి బురద మాత్రమే మిగిలింది.


నీరు లేని ఎల్లమ్మ చెరువు

గంగాధర ఎల్లమ్మ చెరువు, నారాయణాపూర్ చెరువులను రెండింటిని కలిపి రిజర్వాయర్‌గా మార్చి కరీంనగర్ జిల్లాతో పాటు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పంటపొలాలకు సాగు నీరందించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో కొన్నిరోజుల క్రితం కట్ట ఎత్తు పెంచకుండానే నారాయణాపూర్ చెరువు మత్తడి ఎత్తుపెంచారు. కాగా గతేడాది వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి పెద్దఎత్తున వరదనీరు రావడంతో రెండు చెరువులు నిండిపోయాయి. నారాయణాపూర్ చెరువుకట్ట గ్రామసమీపంలో తెగిపోయే ప్రమాదం ఏర్పడడంతో ముంపునకు గురయ్యే గ్రామస్తులను ముందుజాగ్రత్తగా పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ క్రమంలో అధికారులు చెరువు కట్టకు గండిపెట్టారు. అదే సమయంలో ఎల్లమ్మచెరువులోకి సైతం వరద ఉధృతి పెరగడంతో కట్టకు గండిపడింది. దీంతో రెండు చెరువుల్లోని నీరు ఖాళీ అయింది.

మరమ్మతులకు అడ్డంకి...

రెండు చెరువులకు గండి పడడంతో గతేడాది యేసంగి పంటలకు సాగునీటి సమస్య తలెత్తింది. ప్రతీ ఏడాది ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని నారాయణాపూర్ చెరువులోకి పంపింగ్ ద్వారా నింపి ఎగువ, దిగువ ప్రాంతాల పంటపొలాలకు సాగునీరందించేవారు. గతేడాది వర్షాకాలంలో చెరువులకు గండ్లు పడడంతో వేసవిలో సాగునీటి సమస్య ఏర్పడింది. రైతులు, ప్రతిపక్ష పార్టీ నాయకులు ఆందోళనకు దిగడంతో మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. దీంతో నారాయణాపూర్ చెరువు కట్ట మరమ్మతులకు వచ్చిన కాంట్రాక్టరును గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ గ్రామాన్ని ముంపుగ్రామంగా ప్రకటించాలని, పరిహారం నిధులు మంజూరు చేయాలని అంతవరకు కట్టమరమ్మతు పనులు చేయనివ్వమని అడ్డుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామస్తులను ఒప్పించి నారాయణపూర్ చెరువుకట్ట మరమ్మతులు చేయించారు. ఎల్లమ్మచెరువు కట్ట మరమ్మతు పనులను మంగపేట గ్రామస్తులు అడ్డుకున్నారు. రిజర్వాయర్ నిర్మాణంలో భూములు, బావులు, ఇండ్లు కోల్పోతున్నామని పదేళ్లైనా పరిహారం ఇవ్వడం లేదని, నిధులు మంజూరయ్యే వరకు పనులు చేయనివ్వమని బాధితులు గండిపడిన కట్టవద్ద నిరాహార దీక్షచేపట్టారు. అధికారులు కట్ట మరమ్మతులు చేయించకుండానే వదిలేశారు. దీంతో ఈ ఏడాది భారీగా వర్షాలు కురుస్తున్నా, వరదనీరు వస్తున్నా ఎల్లమ్మ చెరువులో నీరు నిలువడం లేదు.

రైతులను ఒప్పించాలి



భూ నిర్వాసిత రైతులకు పరిహారం మంజూరు చేయాలి. లేదంటే చెరువుకట్ట మరమ్మతులను అడ్డుకుంటున్న రైతులను ఒప్పించి పనులు చేయించాలి. ప్రస్తుతం వర్షం నీటితో పొలాలు దున్నుతున్నాం. చెరువుల్లో నీళ్లు లేకుంటే కోతదశలో సాగునీటి కష్టాలు తప్పవు.

– మాటూరి మల్లేశం, రైతు

చెరువుకట్టకు మరమ్మతు చేయాలి



ఎల్లమ్మ చెరువు కట్టకు అధికారులు మరమ్మతు చేయాలి. ప్రస్తుతం చెరువులోకి వరదనీరు వస్తున్నా నీరునిల్వ ఉండడం లేదు. వరదనీటితో దిగువన పొలాలు దెబ్బతింటున్నాయి. ఇలాగైతే భవిష్యత్‌లో భూగర్భజలాలు అడుగంటి దిగువ ప్రాంతంలో పంటల సాగుకు, తాగు నీటికి సమస్య తప్పదు.

– పర్శరాములు, రైతు, గంగాధర

గ్రామస్తులు సహకరించాలి



ఎల్లమ్మ చెరువుకు గండిని పూడ్చడానికి మంగపేట గ్రామస్తులు సహకరించాలి. సంవత్సర కాలంగా ఎల్లమ్మ చెరువులో నీరులేక రైతులు సాగునీటి సమస్యతో పాటు, గంగాధర గ్రామస్తులు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు భారీగా కురుస్తున్నా ఎల్లమ్మ చెరువు నీటి నిలువకు నోచుకోవడం లేదు.

– మడ్లపల్లి గంగాధర్, సర్పంచు, గంగాధర

మౌలిక భాష, నైపుణ్య సాధనకు శిక్షణ

- ఎంఈవో విడుపు శ్రీనివాస్
- ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం

జమ్మికుంట/ఇల్లందకుంట/వీణవంక: ప్రాథమిక స్థాయిలో తెలుగు, గణితం, ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులకు మౌలిక భాష, నైపుణ్యంపై శిక్షణ విద్యార్థులకు బోధనలో మేలుచేస్తుందని ఎంఈవో విడుపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఒకటోతరగతి నుంచి 5వతరగతి వరకు బోధించే ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు మౌలిక భాష, గణితం నైపుణ్యం సాధనపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్, ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి వీర సమ్మయ్య మాట్లాడుతూ.. గతేడాది నిర్వహించిన శిక్షణకు కొనసాగింపుగా శిక్షణ ఇస్తున్నామని లోపాలను సవరించుకుంటూ బోధన చేయాలన్నారు. కరదీపికలను క్షుణ్ణంగా పరిశీలించాలని, విద్యార్థుల వర్క్ బుక్కులను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు నరేందర్‌రావు, సదానందం, రిసోర్స్‌పర్సన్స్ సంపత్, సరిత 39 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లందకుంటలో... మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి బోధించే తెలుగు ఉపాధ్యాయులకు రెండురోజుల శిక్షణను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కరదీపికలను అందించారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ మండలనోడల్ అధికారిసాంబయ్య, రిసోర్స్‌పర్సన్స్,ఉపాధ్యాయులుశ్రీలత, లక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

వీణవంకలో.. మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో రెండు రోజులు నిర్వహించే తెలుగు ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో విడపు శ్రీనివాస్, మండల నోడల్ అధికారి శోభారాణి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం పులి అశోక్‌రెడ్డి, ఆర్పీలు బాలాజీ, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించేలా 'తొలిమెట్టు'

తిమ్మాపూర్: విద్యార్థుల్లో గుణాత్మక విద్యను పెంపొందించేందుకు ప్రభుత్వం తొలిమెట్టు కార్యక్రమం నిర్వహిస్తోందని రాష్ట్ర ఎఫ్ఎల్ఎన్ నోడల్ ఆఫీసర్ వినాయక్ అన్నారు. జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో ఉపాధ్యాయులకు బుధవారం నుంచి తొలిమెట్టుపై శిక్షణ ప్రారంభించారు. తిమ్మాపూర్, గన్నేరువరం మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు తెలుగు, గణితము, ఆంగ్లములలో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

సమ్మెపై ప్రభుత్వం స్పందించాలి


దీక్షా శిబిరాన్ని సందర్శించిన కాంగ్రెస్ శ్రేణులు

చిగురుమామిడి: గత కొన్ని రోజులుగా గ్రామపంచాయతీ కారోబార్లు, పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. బుధవారం చిగురుమామిడి మండలకేంద్రంలో జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్, అధికార ప్రతినిధులు ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి, దాసరి ప్రవీణ్‌కుమార్, నాయకులు షాబుద్దీన్, పొన్నం సంపత్, అనువోజు బాలకృష్ణాచారి పలువురు నాయకులు ఉన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి

గన్నేరువరం: అధ్వానంగా మారిన రహదారులను బాగుచేయాలని ఈనెల 4న గన్నేరువరం మండలం బంద్‌ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, యువజన సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ.. గుండ్లపల్లి పొత్తూర్ డబుల్ రోడ్డు నిర్మాణం, గన్నేరువరం మైలారం రహదారి నిర్మాణం పారువెల్ల గన్నేరువం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం, గన్నేరువరం చొక్కారావుపల్లె మధ్య హైలెవల్ బ్రిడ్జి, జంగపల్లి హన్మాజిపల్లి బ్రిడ్జి, గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్ మధ్య కల్వర్టు ఏర్పాటు చేయాలని, గన్నేరువరం నుంచి యాస్వాడ వరకు తారురోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. రహదారులు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో రవీందర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మల్లేశం, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇంటికి ఐదు మొక్కలు పంపిణీ

చొప్పదండి: మండలంలోని కొలిమికుంటలో తెలంగాణకు హరితహారంలో భాగంగా ఇంటింటికి ఐదు మొక్కలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, సర్పంచ్ తాళ్లపల్లి సుజాత మహిళలకు మొక్కలు పంపిణీ చేశారు. పూలు, పండ్లమొక్కలను ప్రతీ ఇంట్లో నాటాలని సూచించారు. కార్యక్రమంలో సీఈవో క్లెం తిరుపతిరెడ్డి, డైరెక్టర్ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు కేసీఆర్

గన్నేరువరం: సీఎం కేసీఆర్ రైతుబాంధవుడని, రైతు పక్షపాతని జిల్లా రైతుబంధు సమితి కోర్డినేటర్ గుడెల్లి తిరుపతి అన్నారు. మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతు రుణమాఫీ చేసి రైతులకు బాసటగా నిలిచాడన్నారు. రుణమాఫీ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నిన రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. రైతు రుణమాఫీ చేసిన సీఎం కేసీఆర్‌కు, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పళ్ల రాజేశ్వర్‌రెడ్డికి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు

శంకరపట్నం: డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన శంకరపట్నం తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు బుధవారం సిబ్బంది వీడ్కోలు సన్మానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐలు అరుణ, లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన మల్లేశ్

ఇల్లందకుంట: ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై నాంపెల్లి రాజ్‌కుమార్‌ను బుధవారం కరీంనగర్ జిల్లా ఫిషర్‌మెన్ అధ్యక్షుడు బండి మల్లేశ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు.

చలో కోరుట్ల పోస్టర్ ఆవిష్కరణ...

హుజూరాబాద్/ఇల్లందకుంట: పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద పద్మశాలీల రాజాధికార సాధనకు చలో కోరుట్ల రాజకీయ యుద్ధభేరి పోస్టర్లను రాష్ట్ర పద్మశాలీ సంఘం జిల్లా సమన్వయకర్త అడిచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 13న పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కోరుట్లలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కో కన్వీనర్ చిలుకమారి శ్రీనివాస్, హుజూరాబాద్ మండల కన్వీనర్ సంగెం సత్యనారాయణ, బండారి సదానందం, పోరండ్ల రమేశ్, చిలుకమారి రాజమౌళి, దాసి సదానందం, సంగెం శ్రీనివాస్, సంగెం శ్రీధర్, చిలుకమారి కుడికాల సాయి విహాస్, వంగ గణేశ్, హుజూరాబాద్ టౌన్ కన్వీనర్ ఇప్పలపల్లి చంద్రశేఖర్, ఇల్లందకుంట మండల అధ్యక్షుడు ముషం కాశీనాథం, ఉపాధ్యక్షుడు తిరుపతి, గుత్తికొండ రవికుమార్, చిరాల వైకుంఠం, దొంతుల రాజేశం,రత్తయ్య, మధుసూదన్, సత్యనారాయణ,సదానందం ,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యత గుర్తించాలి


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జవేరియా


అన్నప్రాసన చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మానకొండూర్: పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరమని సీడీపీవో సరస్వతీ అన్నారు. మానకొండూర్ మండలంలోని అన్నారంలో చల్మెడ ఆనందరావు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. చల్మెడ వైద్యాధికారి శ్రీదేవి మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు తల్లిపాలు తప్పకుండా పట్టించాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని పిల్లలకు ఏసమయాల్లో ఎలాంటి ఆహారం అందించాలో వివరించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. సర్పంచ్ బొట్లకిషన్, డాక్టర్ రాజమౌళి, అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిల్, హెచ్‌డీవో రమ్య, సంగీత, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్స్ చల్మెడ కళాశాల విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.

జమ్మికుంట: తల్లిపాలతో శిశువుకు రోగనిరోధక శక్తి పెరిగి, ఆరోగ్యంగా ఉంటారని వావిలాల పీహెచ్‌సీ వైద్యాధికారి సనజవేరియా అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంట ప్రాథమిక ఆరోగ్యఉపకేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, తల్లులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం వర్షాకాలంలో సంభవించే వ్యాధులు, వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, డ్రైడేపై అవగాహన కల్పించారు.

హెల్త్ క్యాంపు..

పట్టణంలోని హౌజింగ్ బోర్డుకాలనీలో కౌన్సిలర్ శ్రీపతి నరేశ్ ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంపు నిర్వహించారు ఈ సందర్భంగా కాలనీలోని వృద్ధులు, రోగులకు వైద్యపరీక్షలు చేసి మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మహోన్నత, సూపర్‌వైజర్ రత్నకుమారి, ఏఎన్ఎం రజిత, ఆశా వర్కర్లు శ్రీలత, రహిమ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: తల్లిపాల ప్రాముఖ్యత గుర్తించాలని పుట్టిన పిల్లలకు తల్లిపాల ప్రాముఖ్యతను బాలింతలు గుర్తించాలని ఎంపీపీ చిలుక రవీందర్ కోరారు. మండలంలోని కొలిమికుంటలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వివిధ కూరగాయల ఆవశ్యతను ఐసీడీఎస్ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కస్తూరి, రమాదేవి, సర్పంచ్ తాళ్లపల్లి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

దళితులందరికీ దళితబంధు ఇవ్వాలి

మానకొండూర్/చొప్పదండి/రామడుగు/హుజూరాబాద్‌రూరల్/శంకరపట్నం: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూరు నియోజకవర్గాల్లో బుధవారం దళితబంధు అందించాలని బీజేపీ శ్రేణులు ప్రభుత్వ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా రామడుగు మండలకేంద్రంలో బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి దళితబంధు లబ్ధిదారులతో కలిసి దరాఖస్తులను ఎంపీడీవో భాస్కర్‌రావుకు అందించారు. ప్రతి ఒక్కరికీ దళితబంధు ఇవ్వకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. హుజూరాబాద్‌రూరల్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు బోరగాల సారయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. చొప్పదండిలో బీజేపీ దళితమోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.


దరఖాస్తులు అందిస్తున్న బీజేపీ నాయకులు

అంబేడ్కర్ విగ్రహంనుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు డప్పుచప్పుళ్లతో ర్యాలీ తీశారు. బీజేపీ మానకొండూర్ అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ దళిత మోర్చా పక్షాన ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. శంకరపట్నంలో అర్హులకు దళితబంధు ఇవ్వాలని సూపరింటెండెంట్ శ్రీధర్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై హర్షం

వీణవంక: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం అభినందనీయమని ఎంతోమంది ఆర్టీసీ కార్మికులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల నేరవేరిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గంగాడి తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని నర్సింగాపూర్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కేసీఆర్ కట్టుబడి ఉన్నాడని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో కార్మికులు ప్రభుత్వఉద్యోగులగా గుర్తించబడ్డారన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాతే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని, కేంద్రప్రభుత్వం ప్రకటించిన అవార్డుల్లో తెలంగాణ నుంచే ఎక్కువ శాతం గ్రామపంచాయతీలున్నాయని వివరించారు. దళితబంధు ద్వారా దళితులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని, దళితబంధు పథకం ఇతర రాష్ట్రాల్లో అమలుకు అక్కడి ప్రభుత్వాలు ఆలోచన చేస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, హుజూరాబాద్‌లో జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఎరువుల ధరలు తగ్గించి రైతులకు అందిస్తున్నాం

చొప్పదండి: తమ సొసైటీ ద్వారా ఎరువుల ధరలు తగ్గించి రైతులకు అమ్ముతున్నామని జాతీయ ఉత్తమ పీఏసీఎస్ అవార్డు గ్రహీత వెల్మ మల్లారెడ్డి అన్నారు. మండలలోని కొలిమికుంటలో పీఏసీఎస్ గోదాంకు క్రిబ్‌కో సంస్థ రూ.30వేల విలువైన కుర్చీలను విరాళం ఇవ్వగా క్రిబ్‌కో రాష్ట్ర మేనేజర్ రామకృష్ణతో కలిసి వాటిని అందించారు. కొలిమికుంట గ్రామాన్ని క్రిబ్‌కో దత్తత తీసుకుందన్నారు. మేనేజర్ మాట్లాడుతూ.. మల్లన్నపల్లి గ్రామానికి వచ్చే ఏడాది తగినసాయం చేస్తామన్నారు. క్రిబ్‌కో ద్వారా నామమాత్రం లాభాలతో 18 రకాల రసాయన ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తున్నామన్నారు. మండలంలోని చొప్పదండి పీఏసీఎస్ పరిధి రైతులకు ఉచిత భూసారపరీక్షలు చేయించేందుకు సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపల్లి సుజాత, ఎంపీటీసీ తోట కోటేశ్, క్రిబ్‌కో జిల్లా మేనేజర్ ప్రేమ్‌తేజ్ నాయుడు, సీఈవో క్లెం తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్తు నర్సయ్య, పాల్గొన్నారు.


కుర్చీలు అందిస్తున్న క్రిబ్‌కో మేనేజర్, చైర్మన్

విద్యారంగంపై ప్రభుత్వాల చిన్నచూపు

హుజూరాబాద్: విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర గర్ల్స్ కన్వినింగ్ కమిటీ కన్వీనర్ పూజ, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లూరి కిషోర్ ఆరోపించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రారంభమైన ఎస్ఎఫ్ఐ పాదయాత్ర బుధవారం హుజూరాబాద్ పట్టణానికి చేరింది. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ఇప్పటి వరకు చెల్లించలేదని, గురుకుల పాఠశాలలో రెగ్యులర్ టీచర్లు లేరని, సొంతభవనాలు లేక అద్దె భవనాల్లో విద్యార్థులు చదువుతున్నారని అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న జాతీయ నూతన విద్యా విధానంతో పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో అన్ని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అభిలాశ్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కదిరే రమేశ్ ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.